# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 10 ఏప్రిల్ 2025


## ఒక్క డజన్ నిమ్మకాయలు రూ.100

**రామసముద్రం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :**



నిమ్మకాయల ధరలకు రెక్కలొచ్చాయ. వాతావరణంలో చోటుచేసుకొన్న ప్రతి కూల పరిస్థితుల కారణంగా నిమ్మకాయలు ధరలు మోతమోగిస్తూ చుక్కలనంటుతున్నాయి. రెండు నెలల క్రితం డజను రూ.30లు పలికిన నిమ్మకాయలు ప్రస్తుతం ఏకంగా డజనుకాయలు రూ.100లు చేరింది. అంటే ఒకొ ్క నిమ్మపండు చిన్నది 7, పెద్దవి 8లు చొప్పున అమ్ముతున్నారు. దీంతో పేద, మద్య తరగతి వర్గాల ప్రజలు నిమ్మజోలికి వెళ్ళాలంటే జంకుతున్నారు. వేసవికాలంలో నిమ్మ వాడకం ఎక్కువుగా ఉంటుంది. దీనికి తోడు ప్రస్తుతం ఎండ దూకుడు పెంచడంతో నిమ్మ వినియోగం పెరిగింది. ప్రజలు అవసరాలకు తగ్గట్టు దిగుబడులు లేకపోవడంతో వాటి ధరలు మునుపెన్నడూ లేనంతగా పెరిగాయి. ఈసారి దిగుబడి తగ్గడంతో నిమ్మకాయల అమ్మకాలు తగ్గాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే గత ఏడాది అధిక వర్షాలు వల్ల ఖరీఫ్‌లోని అక్టోబర్, నవంబర్ నెలల్లో దిగుబడులు రావడంతో మార్చి నెల నుంచి రావాల్సిన దిగుబడులు గణనీయంగా తగ్గాయని పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల కారణంగా వేసవిలో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో నిమ్మధరలకు రెక్కలొచ్చి చుక్కలనంటుతున్నాయి.

## ఎన్‌హెచ్ఆర్‌సిలీగల్‌సెల్ రాష్ట్ర అదనపు కారదర్శిగా ధీరజ్

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త**



నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ లీగల్ సెల్ స్టేట్ అడిషనల్ సెక్రటరీగా తనను నియమించినట్లు న్యాయవాది తోట శ్రీనివాస ధీరజ్ తెలిపారు. హైకోర్టు న్యాయవాదిగా బీజేపీ రాజంపేట జిల్లా కార్యదర్శి తోట శ్రీనివాస ధీరజ్ ని జాతీయ మానవ హక్కుల మండలి లీగల్ సెల్ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా నియమిస్తూ ఎన్.హెచ్.ఆర్.సి. జాతీయ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా తోట ధీరజ్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రాజకీయ కక్షల వలన మానవ హక్కుల ఉల్లంఘన శాతం రోజురోజుకీ పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.మానవ హక్కుల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు మహోన్నతమైన బాధ్యతని అప్పగించిన జాతీయ చైర్మన్ సంపత్ కుమార్ కు ధీరజ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాష్ట్రంలో మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

### రాజంపేట మున్సిపాలిటీకి సిఎస్ఆర్ నిధులతో 6,చెత్త సేకరణ ఆటోలు...రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి







**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాజంపేట మున్సిపాలిటీకి సిఎస్ఆర్ నిధులు 21 లక్షలతో కొనుగోలు చేసిన 6 చెత్త సేకరణ ఆటోలను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సమక్షంలో రాజంపేట మున్సిపల్ కమిషనర్ కు అప్పగించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ రూపొందించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. మున్సిపాలిటీల అభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతంగా చేపట్టడం జరుగుతుందన్నారు. చెత్త సేకరణకు సంబంధించి గతంలో ప్రతి ఇంటి నుంచి డబ్బులు వసూలు చేసే వారని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎవరి దగ్గర ఒక పైసా కూడా డబ్బులు తీసుకోకుండా ఉచితంగా చెత్త సేకరించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే రోజులలో మున్సిపాలిటీల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. రాజంపేట మున్సిపాలిటీకి ఆరు చెత్త సేకరణ ఆటోలను అందించిన ఏంప్రేడా మైనింగ్ సంస్థ ఎండి ఆకేపాటి విక్రమ్ రెడ్డిని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఆకేపాటి విక్రమ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ లు కొబ్బరికాయ కొట్టి, జెండా ఊపి ఆటోలను ప్రారంభించారు.

### చరణములే నమ్మితీ ...

## నీ దివ్య చరణములే నమ్మితీ

**హనుమంత సేవలో కోదండ రాముడు**

**ముగ్ధ మనోహర రూపం నవనీత కృష్ణాలంకారం**

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త**

చరణములే నమ్మీతీ ...నీ దివ్య చరణములే నమ్మితీ.. అంటూ ఒంటిమిట్ట కోదండరాముడు తన భక్తుడు హనుమంతుని సేవలో బుధవారం తరించారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం ఉదయం నవనీత కృష్ణాలంకారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. నవనీత కృష్ణ అలంకార సేవలో స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం కృష్ణుడు వెన్నదొంగ. రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే గాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామి తన అపర భక్తుడు హనుమంతుని భుజస్కందాలపై తనవి తీరా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళల కోలాటాలు, కేరళ వాయిద్యాలతో హనుమత్సేవ శోభాయమానంగా సాగింది.ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ పురోహితులు,పలువురు టిడిపి సిబ్బంది, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## రమణీయం..రథోత్సవం

**వాల్మీకిపురం, ఏప్రిల్ 09 ప్రభాతవార్త:**

శ్రీ పట్టాభిరామస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం ఉదయం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. సీతా లక్ష్మణ సమేత శ్రీరాముడి ఉత్సవర్లను శోభాయమానంగా అలంకరించి రథాన్ని అధిష్టించి తిరుమాఢవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. రథోత్సవం ముందు భక్తులు రామనామ స్మరణ, డప్పు వాయిద్యాలు, భజన బృందాలు, కోలాటాలు, సంకీర్తనల నడుమ కోలాహలంగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూరనీరాజనాలు అందించారు. అశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి రథాన్ని తిరుమాడ వీధుల్లో విహరించి యథాస్థానానికి చేరిన తర్వాత స్వామివారిని తిరుచ్చిలోకి వేంచేపు చేసి హారతి ఇచ్చారు. అంతకుముందు వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన, మొదటి గంట, శాత్తుమొర కార్యక్రమాలు భక్తులకు కనువిందు చేశాయి. రథోత్సవం అనంతరం స్వామివారికి స్నపన తిరుమంజనం, కైంకర్యములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



రథోత్సవంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

## పొద్దు పొడవక ముందే నడిరోడ్డుపై కూరగాయల మార్కెట్

**:అంబులెన్స్‌కు సైతం దారి ఇవ్వని వైనం :ఇబ్బందికరంగా మారిన ట్రాఫిక్ :పట్టించుకోని పోలీసులు**





**బద్వేలు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :**

పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో కూరగాయల మార్కెట్ వద్ద రాత్రి 7గంటలనుంచే రైతులు వచ్చి విక్రయాలు జరుపుతుండడంతో పలువురు వాహనదారులు మరియు పాదచారులకు ఇబ్బందిగా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పలువురు రైతులు తాము పండించిన పంటలను ఆటోలలో, తదితర వాహనాలలో కూరగాయల మార్కెట్ వద్దకు తేవడంతో అక్కడ అమ్మే రైతులు, వారి దగ్గర కొనుగోలు చేసే దళారులు మరియు సామాన్య ప్రజలతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయి ఉంటుంది. దీనికితోడు వారు లోడ్లు తీసుకువచ్చిన ఆటోలు సైతం రోడ్డుపై ఉంచడంతో వాహనదారుల రాకపోకలు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇదే సమయంలో ఏదైనా అనుకోని అగ్ని ప్రమాదాలు, మరే ఇతర ప్రమాదాలు జరిగినా సంబంధిత వాహనాలైన అంబులెన్స్, ఫైరింజన్ వంటివి త్వరగా వెళ్లాలన్నా ఈ ట్రాఫిక్ కారణంగా ఇబ్బంది పడే దుస్థితి ఏర్పడింది. గతంలో పోలీసు అధికారులు ఇచ్చిన సూచనల మేరకు రైతులు రాత్రి 9.30 నుంచి 10 గంటల ప్రాంతంలో తమ సరుకును తెచ్చి విక్రయించుకునేవారు. రాత్రి సమయం కావడంతో వాహనాల రద్దీ తక్కువగా ఉంటుంది కావున వారితో పాటు వాహనాల రాకపోకలు మరియు పాదచారులకు సైతం ఏలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. రానురాను ఈ సమయం కాస్త 9 గంటలకు మారింది. ఇంకొంత కాలానికి 8 గంటలకు ప్రస్తుతం 6.30 గంటలనుంచి 7 గంటలకే రైతులు వాహనాలలో వస్తుండడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కాగా మొదట్లో సాయంత్రం 5గంటల నుంచే అమ్మకాలు చేయడంతో అదే సమయంలో కూరగాయల మార్కెట్ పక్కనే ఉన్న జడ్పీబాలుర ఉన్నత పాఠశాల సమయం ముగిసి విద్యార్థులను బయటకు వదలడంతో ఓవైపు అధిక సంఖ్యలో ఉన్న విద్యార్థులు, మరోవైపు వారికోసం వచ్చే తల్లిదండ్రులు, వారిని ఇతర ప్రాంతాలకు తరలించే ఆటోలతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయి ఉండేది. ఈ సమస్యను మార్కెట్‌కు కూతవేటు దూరంలో ఉన్న పోలీసు అధికారులు మరియు మున్సిపాలిటీ సిబ్బంది గమనించి రైతులను రాత్రి 10 గంటలు ఆపైన విక్రయాలు చేసుకోవాలని సూచించారు. కొంతకాలానికి ఈ సమస్య సద్దుమణిగి రాత్రి సమయాలలోనే వచ్చేవారు. ఈ మధ్యకాలంలో వారు మరళా పాత సమయమైన సాయంత్రం 6 గంటలకే రావడంతో సంబందిత పోలీసు అధికారులు వారిని బెదిరించి వారి ఆటోలను సైతం పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి వాళ్లకు వార్నింగ్ ఇవ్వడం జరిగింది. ఇది తాత్కాలికమే అయ్యింది తప్ప శాశ్వత పరిష్కారం కాలేదు. దీంతో రైతులు మరళా వారు అనుకున్న సమయానికే మార్కెట్ వద్ద విక్రయాలు జరుపుతుండడంతో ఆ ప్రాంతమంతా ప్రజలతో నిండిపోయి వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనిపై శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు ప్రజలు మరియు వాహనదారులు కోరుతున్నారు.

## మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

**టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు**

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త**



ఈ నెల 12 వ తేదీన రాజంపేటకు విచ్చేస్తున్న అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ మంత్రి బి.సి జనార్ధన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చెయ్యాలని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు పార్టీ శ్రేనులను కోరారు. బుధవారం ఇంచార్జి మంత్రి పర్యటన సందర్భంగా పార్లమెంట్ క్యాంప్ కార్యాలయం లో ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ఇన్చార్జి మంత్రి హోదాలో రాజంపేటకు విచ్చేస్తున్న బీసీ జనార్దన్ రెడ్డికి రాజంపేట తెలుగు తమ్ముళ్ల సత్తా చాటాలని కోరారు. రాజంపేట నియోజకవర్గం టిడిపిలో ఎలాంటి గ్రూపులో లేవని ఉన్నదల్లా టిడిపి గ్రూపు, చంద్రబాబు లోకేష్ గ్రూపే అని, పార్టీ పుట్టినప్పటినుంచి పని చేస్తున్న ప్రతి కార్యకర్త, పసుపు జెండా ఎత్తుకున్న ప్రతి నాయకుడు, చంద్రబాబు కి విధేయత చూపే ప్రతి పసుపు సైనికుడు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అధిక ప్రాధాన్యం ఇచ్చేఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. అందుకే అందరూ ఒక్కతాటిపై కొచ్చి ఇన్చార్జి మంత్రి పర్యటన విజయవంతం చేసి రాజంపేటలో 2029 లో పసుపు జెండా ఎగరేస్తామనేలా ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ,మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జిలు, కౌన్సిలర్లు, టిడిపి వార్డు కమిటీ మెంబర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

**పెండ్లిమర్రి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:**

పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బుధవారం కడప బోగా పార్వతమ్మ రక్తదాన కేంద్రం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాదాపు 15 మంది విద్యార్థులు మరియు అధ్యాపకులునాగుల రామకృష్ణ ఈ సందర్భంగా రక్తదానం చేసి రక్తదాన విశిష్టతను చాటి చెప్పారు. ప్రిన్సిపల్ వి.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ రక్తదానం జీవితాల్లో వెలుగు నింపుతుందని కావునా రక్తదానం చేయడం అలవాటుగా చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర్‌రావు విద్యార్థులకు రక్తదాన విశిష్టతను తెలియజేసి రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఇ.నిఖిలప్రియ మాట్లాడుతూ ఇటువంటి రక్తదాన శిబిరాలు నిర్వహించడం అత్యంత అవసరమన్నారు. భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రక్తదానం చేసిన విద్యార్థులకు పండ్లు, ఆరోగ్యకర పానీయాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి వరలక్ష్మి, చెంద్రాయుడు, డా.పి.హరిప్రసాద్, డా.యు.రమ్యజ్యోతి, శ్రీమతి యుగవాణి, ప్రసన్నకుమార్, రామకృష్ణ, తైదున్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న 23 మంది అరెస్ట్

**ప్రొద్దుటూరు క్రైమ్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :**



ప్రొద్దుటూర్‌లో క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టయ్యింది. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న 23 మందిని అరెస్ట్ చేశారు. భారీ నగదు, 23 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్ నిర్వాహకులు ఎంతటి వారైనా తమ నిఘా నుండి తప్పించుకోలేరని డిఎస్పి భావన తెలిపారు. బుధవారం స్థానిక డిఎస్పి కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ అరికట్టు విషయమై గట్టి నిఘా ఏర్పాటు చేయడమైనదని, ఈ క్రమంలో 8 వ తేదీ రాబడిన కచ్చితమైన సమాచారము పై ప్రొద్దుటూర్ 1 టౌన్ సీఐ, ఎస్సై మరియు వారి సిబ్బంది ప్రొద్దుటూర్ టౌన్ రామేశ్వరం నీళ్ళ ట్యాంకిల వద్ద క్రికెట్ బెట్టింగ్ నిర్వహించి అందుకు సంబంధించిన లావా దేవీలు జరుపుతుండిన 18 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 2 లక్షల 5 వేల రూపాయలు డబ్బు, 18 సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. పై కేసులో పుత్తా గిరీష్ అను వ్యక్తి గతంలో ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహించి నష్ట పోయి వుండగా, అతని గురించి తెలుసుకొన్న (బిగ్ బుల్) బిగ్బ్యుల్ 247.కాం అను వెబ్సైట్ వారు అతనిని సంప్రదించి బెట్టింగ్ నిర్వహించమని కోరగా, అతను సదరు వెబ్సైట్ ద్వారా కమిషన్ పొందుతూ తనకు తెలిసిన వారి ద్వారా క్రికెట్ బెట్టింగ్ ఆడే వారిని పై వెబ్సైట్లో చేర్చి వారి ద్వారా మరికొంతమందిని బెట్టింగ్ సభ్యులుగా చేర్చి, ఒక వ్యవస్థీకృతముగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు, అయితే ప్రతి ఆన్లైన్ గేమ్ యాప్, వెబ్సైట్ల పైన మా నిఘా వున్నందున, సదరు వ్యక్తి గురించి కనిపెట్టి అతనిని మరియు అతని అనుచరులైన మరో 40 మందిని గుర్తించడమైనదని తెలిపారు. వారిలో మంగళవారం గిరీష్ తో కలిపి మొత్తం 18 మంది అరెస్టు కాగా, మిగిలిన వారిని అరెస్టు చేయవలసి ఉన్నదని డిఎస్పి భావన తెలిపారు. అదే విధంగా, ప్రొద్దుటూర్ టౌన్ కోనేటి కాల్వ వీధికి చెందిన షేక్ మాబు షరీఫ్ అలియాస్ చుంచు, పిందాల జనార్ధన్ రెడ్డి, భూమిరెడ్డి నాగార్జున రెడ్డి, వేంపల్లి సుదర్శన్ రెడ్డి, శ్రీరామ్ సుబ్బరాయుడు అను వారు, ప్రొద్దుటూర్ టౌన్ ఇస్లాం పురం దర్గా వద్ద ప్రస్తుత ఐపీఎల్ సీజన్ లో వారు బెట్టింగ్ నిర్వహించి, అందుకు సంబంధించి ఇంతవరకు తమ మధ్య వున్న డబ్బు లావాదేవీలు, పంపకాలు చేసుకొనుచుండగా, రాబడిన కచ్చితమైన సమాచారం మేరకు ప్రొద్దుటూర్ 1 టౌన్ సిఐ రామకృష్ణా రెడ్డి, వారి సిబ్బంది సదరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 5 సెల్ ఫోన్ ఒక లక్ష 5వేల రూపాయలనగదు స్వాధీనం చేసుకొనడమైనదనీ,ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన ఏలే నరసింహ, అరవ మునివర, షేక్ ఫారూక్, షేక్ గౌస్ బాష అలియాస్ బెంగుళూరు బాషా, షేక్. ఖాదర్ బాషా అను బెట్టింగ్ నిర్వాహకుల కనుసన్నలలో పై వ్యక్తులు ప్రొద్దుటూరు ప్రాంతం లో ప్రస్తుత ఐపీఎల్ సీజన్ లో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు గుర్తించి అందరి పైనా కేసులు నమోదు చేశామని వివరించారు. అరెస్టు కాబడిన మొత్తం 23 మంది ముద్దాయిలను ఈ దినమే కోర్టు ముందు హాజరు పరిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సిఐలు రామకృష్ణా రెడ్డి, సదాశివయ్య, గోవింద రెడ్డి, బాల మద్దిలేటి, ఎస్సై లు సంజీవరెడ్డి, రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ర్యాలీని జయప్రదం చేయండి

మదనపల్లె, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :



ఈనెల 11న మదనపల్లెలో మహాసంకల్ప ర్యాలీని అన్ని బిసి కులాల పాల్గొని జయప్రదం చేయాలని బహుజన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు తెలిపారు. ఈ సందర్బంగా బుధవారం శ్రీచందు విలేకర్లతో మాట్లాడుతూ భారతదేశ తొలి సాంఘీక సంస్కర్త మహిళా విద్యకు అధ్యుడు బహుజన పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలకు భారతరత్న అవార్డు ఇచ్చి సత్కరించాలని తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఏడాది ఏప్రిల్ 11న పబ్లిక్ సెలవుదినంగా ప్రకటించి, అధికారికంగా పూలే ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న మదనపల్లెలో నిర్వహించే మహాసంకల్ప ర్యాలీలో విద్యార్థి సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. స్థానిక జడ్పిహైస్కూల్లో ఈ ర్యాలీని ఉదయం 10గంటలకు ప్రారంభమై సిటిఎం రోడ్డు మీదుగా టౌన్‌బ్యాంకు సర్కిల్, బెంగుళూరు బస్టాండు, కదిరిరోడ్డు మీదుగా మదనపల్లె మార్కెట్‌యార్డు వద్ద ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వరకు సాగుతుందని తెలిపారు.

# డ్రాప్ బాక్స్ విద్యార్థుల భౌతిక పరిశీలన

కలికిరి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి కె. సుబ్రమణ్యం బుధవారం కలికిరి పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థలను సందర్శించారు. డ్రాప్ బాక్స్ ద్వారా గుర్తించబడిన విద్యార్థుల భౌతిక పరిశీలన కార్యక్రమంలో భాగంగా ఈ పర్యటన చేపట్టారు. జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం కలికిరి పట్టణంలోని సైనిక్ పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు సుజిత్ విద్యాలయం (ఇంగ్లీష్ మీడియం హైస్కూల్)లను ప్రత్యేకంగా సందర్శించారు. ఈ పరిశీలనలో గుర్తించిన విద్యార్థుల వివరాలు సరైనవిగా నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-1 కరీముల్లా, మండల విద్యాశాఖాధికారి-2 జి.నాగార్జున, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.శారద, సుజిత్, విద్యాలయం ప్రధానోపాధ్యాయులు శివకుమార్, సైనిక్ స్కూలు ప్రిన్సిపల్ జిల్లా ఐఈఆర్టీ కోఆర్డినేటర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. వారి సమక్షంలో జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం విద్యార్థుల రికార్డులు పరిశీలించి డ్రాప్ బాక్స్‌లో నమోదు చేసిన వివరాలు, విద్యార్థుల హాజరుతో సరిపోలుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ డ్రాప్‌బాక్స్ విధానం ద్వారా వదిలేసి విద్యార్థులను తిరిగి పాఠశాలలకు తీసుకురావడానికి ఇది ఒక మంచి ప్రయత్నం. సకాలంలో తనిఖీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల మానవ వనరుల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం

కలికిరి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో బుధవారం స్వయం సహాయక గ్రూపు సభ్యులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఈవో ఆర్డీ కె.మహ్మద్ రియాజుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరువేరు చేసి వేయాలన్నారు. గ్రామాల్లో అంబాసిడర్లు తడి, పొడి చెత్త తీసుకునేందుకు వస్తారని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే అంటు వ్యాధుల భారిన పడకుండా ఉంటారని ఈవోఆర్డీ సూచించారు. పంచాయతీ కార్యదర్శి నవాజ్ బాషా తడి, పొడి చెత్తపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జనీఫారాణి, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

# నేటి నుంచి దస్తగిరి స్వామి గ్యార్మీ ఉత్సవాలు

దువ్వూరు, ఏప్రిల్ 09, ప్రభాతవార్త:



మండల పరిధిలోని ఎల్లాల్ కొట్టాల గ్రామంలో గురు, శుక్రవారాల్లో శ్రీ దస్తగిరి స్వామి గ్యార్మీ ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 10వ తేదీన గురువారం గంధం, శుక్రవారం జెండా మెరువని కార్యక్రమం ఉంటుందన్నారు. గ్యార్మీ ఉత్సవాల సంధర్బంగా గ్రామంలో శక్రవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని ఈ పోటీలలో గెలుపొందిన ఎద్దులకు వరుసగా 40వేలు, 30 వేలు, 20 వేలు, 10వేలు, 5వేలు, బహుమతిగా అందజేస్తారన్నారు. అలాగే అన్నదాన కార్యక్రమం కూడ ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# 36మంది గర్భవతులకు వైద్య పరీక్షలు

దువ్వూరు, ఏప్రిల్ 09, ప్రభాతవార్త:



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు బుధవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద 36 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు సురేష్ బాబు, రోషిణిలు తెలిపారు. గర్భవతుల్లో 13మందిని కష్టతరమైన వారిగా గుర్తించి వారికి ప్రత్యేకంగా స్కానింగ్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించామన్నారు. రక్తహీనత ఉన్న గర్భవతులు అంగన్వాడీ కేంద్రాల్లో అందజేసే పోషక పదార్థాలు తీసుకోవాలన్నారు. గర్భవతులందరూ ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు జరిగే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ పథకాలైన జననీ సురక్ష, ప్రధానమంత్రి మాతృత్వ యోజన, జననీ శిశు సురక్ష పథకాల ద్వారా లబ్ది పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# గుప్తా ఫౌండేషన్ సేవలు అభినందనీయం

బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త

బద్వేలు ప్రాంతంలో గుప్తాఫౌండేషన్ ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా అనేక మంది పేదలకు సేవలందిస్తున్నారు. వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రటరీ కొలిశెట్టి నాగరాజ, ఆవుల శ్రీనివాసులుతో పాటు పలువురు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని నిరంతరాయంగా వారి దుకాణం వద్ద పాదచారులకు ప్రత్యేక కూల్ ఫ్రిడ్జ్‌పెట్టి దాహార్తి తీరుస్తూ నిరుపేదలకు అవసరమైన సమయంలో చేయూతనందించడం సంతోషకరమన్నారు. రాబోయే రోజులలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఇంకొంతమంది ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నేలపాటి వెంకటసుబ్బయ్య, జొన్నలగడ్డ సుధాకర్ సురేష్ పత్తి వెంకట నరసింహా లతో పాటు గుప్తా ఫౌండేషన్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



# బ్రహ్మసాగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 09 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని బ్రహ్మసాగర్ (తెలుగంగ ప్రాజెక్ట్)లో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం సాయంత్రం బ్రహ్మం సాగర్‌లో మగ శవం పైకి తేలాడడంతో స్థానికులు పోలీసులకు తెలపగా సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతిని షర్ట్ కు ఎర్రగుంట్ల అనే లేబుల్ వున్నది. వివరాలు ఎవరికైనా తెలిసి ఉంటే బ్రహ్మంగారిమఠం పోలీసువారికి సమాచారం అందించగలరు. తెలిసినవారు ఈక్రింది ఫోన్ నెంబర్ల కు తెలియజేయండి. బ్రహ్మంగారిమఠం ఏఎస్ఐ గుర్రప్ప యాదవ్ ఫోన్ నెంబర్ 9440094128 సబ్ ఇన్స్పెక్టర్ జై చంద్రశేఖర్ 9121100624 సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ 9121100621 తెలపగలరు.

# చలివేంద్రం ప్రారంభించిన అర్బన్ సీఐ

బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త



పట్టణంలోని నెల్లూరు రోడ్డులో గల శ్రీకృష్ణ మందిరం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణ ఆలయ కమిటీ అధ్యక్షులు సింగరయ్య యాదవ్ ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని , బద్వేల్ అర్బన్ సిఐ రాజగోపాల్, తెలుగుదేశం పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, మిత్తికాయల రమణలు ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తుండడంపై వారు వారు వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సిఐ ,టిడిపి నాయకులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, యాదవులు పాల్గొన్నారు.

# ఈ నెల 11న జాబ్ మేళా

వీరపునాయునిపల్లి,ఏప్రిల్ 9,ప్రభాత వార్త:

వీరపునాయన పల్లి మండల వెలుగు ఆఫీసు నందు 11వ తేదీన అనగా శుక్రవారం నాడు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపిఎన్ భాగ్యమ్మ తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూగౌరవ ప్రాజెక్టు డైరెక్టర్ గారి ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీన అనగా శుక్రవారం వెలుగు కార్యాలయం నందు ఆదిత్య బిర్లా గార్మెంట్స్ కంపెనీ నందు ఉద్యోగ అవకాశాలకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుంది. కావున మండలంలో ఉన్నటువంటి అర్హత కలిగిన నిరుద్యోగ మహిళలు ఇంటర్వ్యూలకు హాజరు కావలసినదిగా గౌరవ ప్రాజెక్ట్ డైరెక్టర్ గారు ఆదేశించి ఉన్నారు. వియన్ పల్లి మండలంలో పనిచేస్తున్న సీసీలు మరియు వివోఏలు పై తెలిపిన జాబ్ మేళా గురించి విరివిగా ప్రచారం చేసి జాబ్ మేళాను విజయవంతం చేయవలసిందిగా కోరారు.

# అభివృద్ధి వైయస్ కుటుంబంతోనే సాధ్యం




పులివెందుల,ఏప్రిల్9, ప్రభాత వార్త:

పులివెందులలో సాగు నీరు త్రాగు నీరు,సంక్షేమం అభివృద్ధి వైఎస్ కుటుంబం తోనే సాధ్యం అని వైకాపా నాయకులు అన్నారు. బుధవారం పట్టణం లోని స్థానిక వైకాపా కార్యాలయం నందు వైకాపా నాయకులు మీడియాతో మాట్లాడుతూ జగన్ హయాం లో 90 శాతం పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పులివెందుల అభివృద్ధి పనులు మరియు జలజీవన్ మిషన్ వాటర్ ఇంటిగ్రేటెడ్ విధానం, క్రికెట్ స్టేడియం ను షాపింగ్ కాంప్లెక్స్ లు, ఆగిపోయిన సిమెంట్ రోడ్లను పూర్తిగా నిర్వీర్యం చేసి ఇప్పుడు కూటమి నాయకులు నాటకాలు ఆడుతున్నారన్నారు. పులివెందుల ప్రాంతం లో వ్యవసాయం నీటి ఆధారిత పంటలు అయిన అరటి ,దానిమ్మ ,డ్రాగన్ హార్టికల్చర్ వైపు రైతులు వెళ్తున్నారంటే దానికి పులివెందుల ప్రాంతానికి సాగు నీళ్లు అందించిన ఘనత వైఎస్ కుటుంబానిది అన్నారు. కూటమి నాయకుల కు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటి వరకు ఎన్ని రూపాయలు నిధులు ప్రభుత్వం నుంచి విడుదల చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా కనీసం ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయకపోవడం దారుణం అన్నారు. అన్నిరంగాల వారిని మోసం చేసి కరెంట్ చార్జీలు పెంచి స్మార్ట్ మీటర్ లు లేకుండా చేస్తాం అని బురిడీ కొట్టించి రైతులకు పెట్టుబడి సాయం, విద్యార్థులకు సరైన విద్య వసతులు, ఉద్యోగులకు బకాయిలు, నిరోద్యుగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసి కొన్ని వేల కోట్లు అప్పులు చేస్తూ ఇప్పుడు మేకవన్నె పులి లా మారి ప్రజలని పట్టి పీడిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సిపి నాయకులు పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ చిన్నప్ప , నూర్ భాషా సంఘం అధ్యక్షులు రసూల్, వైస్ చైర్మెన్ హఫీజ్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ , రాష్ట్ర బూత్ కమిటీ నాయకులు చంద్రమోళి, కౌన్సిలర్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిని బలోపేతం చేయాలి : చల్లపల్లె

మదనపల్లె, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :



మాట్లాడుతున్న చల్లపల్లె నరసింహారెడ్డి

పట్టణంలోని స్థానిక బిజెపి కార్యాలయంలో బిజెపి క్రియాశీలక కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లపల్లె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సబ్‌కసాత్ సబక్ వికాస్, సబక్ విశ్వాస్ అనే సూత్రంతో ప్రజలందరిని పరిపాలన చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విజయభారతి స్కూల్ కరస్పాండెంట్ సేతు, బిజెపి రాజంపేట పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల క్రిష్ణమూర్తి, ఎల్లంపల్లి ప్రశాంత్, బర్నేపల్లి రవి కుమార్, ఓసూరి కిరణ్‌కుమార్, బండి ఆనంద్, మండల అధ్యక్షులు పూల నాగరాజు, మటన్ కిరణ్‌కుమార్, వెంకటరమణారెడ్డి, కోసూరి భవాని, ఆనంద్ కుమార్, సునీల్ కుమార్, క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమమే ఎన్.ఎస్.యు.ఐ ధ్యేయం

పీలేరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త :

విద్యార్థుల సంక్షేమమే ఎన్.ఎస్.యూ ఐ లక్ష్యమన్నారు. చదువు, స్వేచ్ఛ, ఉపాధి, భారతదేశంలో ప్రతి ఒక్కరికి అందించడం కోసం ఎన్.ఎస్.యూ.ఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలు పరిష్కారంలో విఫలం చెందాయని ఈ సందర్భంగా అమృత్ తేజ అన్నారు. అదేవిధంగా తాను 2011 డిసెంబర్ లో ఎన్.ఎస్.యూ.ఐ కలికిరి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల అధ్యక్షులుగా ఎన్నికైనప్పటి నుంచి నేడు ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అంచలంచలుగా ఈ స్థాయికి చేరుకున్నాను అంటే దానికి ప్రధాన కారణం తన ఆప్తులు,మిత్రులు అని వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్.ఎస్.యూ.ఐ విద్యార్థి సంఘం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్యలను పరిష్కరించిన అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్.ఎస్.యూ.ఐ నాయకులకు మరియు కార్యకర్తలకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఎందుకంటే వారి వల్లే ఎన్.ఎస్.యూ.ఐ నేడు ఈ స్థాయిలో ఉంది అని గర్వంగా తెలియజేస్తున్నాను అని అన్నారు.

# బీసీలకు 52 రిజర్వేషన్లు కల్పించాలి

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 9 , ప్రభాతవార్త

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ పట్టణంలోని అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద బుధవారం బీఎస్పీ బహుజన పార్టీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ మేరకు ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గౌస్ పీర్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు గౌతం కుమార్ ఆదేశాల మేరకు బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ కడప కలెక్టరేట్ వద్ద ఈనెల 11వ తేదీ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జరిగే నిరసన కార్యక్రమానికి బీసీలందరూ అత్యధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

# మండల వైసీపీ ఎస్సి సెల్ అధ్యక్షులుగా శివ

రామసముద్రం ఏప్రిల్ 9 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా, మదనపల్లి నియోజకవర్గం మండల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులుగా శివ, కార్యదర్శి గా కె. నారాయణ స్వామి నియమితులైనట్లు పార్టీ కేంద్ర కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మదనపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ నిస్సార్ అహ్మద్, మదనపల్లి మాజీ ఎం మ్మెల్యే తిప్పారెడ్డి, మాజీ ఎంమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ నియామకానికి సహకరించిన మండల కన్వీనర్ కేశవరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు సి హెచ్ రామచంద్రారెడ్డి, మండల సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్, రాష్ట్ర బిసి సెల్ సెక్రటరీ గెవన్న, మండల ఎంపీపీ కుసుమ కుమారీ, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, మండల బిసి సెల్ అధ్యక్షులు దొడ్డిపల్లె ఆనంద్ , వైసీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కృష్ణా రెడ్డి, వైసీపీ ముఖ్య నాయకులుసి హెచ్ ప్రకాష్ మరియు వార్డు ఇంచార్జులకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.కె. నారాయణ స్వామి, శివ మాట్లాడుతూ వైసీపీ పార్టీఆవిర్భావం నుండి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నామని .కష్టపడి పని చేసినందుకు పార్టీ అధిష్టానం మమ్మల్ని గుర్తించి మాకు పదవులు ఇచ్చినందుకు వైసీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని . పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వహించి, మండల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి మాశక్తి మేర కృషి చేసి, ప్రజల నమ్మకాన్ని, వైసీపీ పార్టీ గౌరవాన్ని నిలబెట్టడమే మా లక్ష్యం అని వారు తెలియజేశారు. మా కు మండల వైసీపీ ఎస్సి సెల్ మండల కార్యదర్శిగా పదవి రావడానికి కారకులైన వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు కేశవరెడ్డి, జడ్పీటీసీ రామచంద్రారెడ్డి,భాస్కర్ గౌడ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరోగ్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం సాధ్యం

పీలేరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త :



పాలు, బ్రెడ్ అందిస్తున్న వైద్యబృందం

గర్భవతులకు ఆరోగ్య పరీక్షల ద్వారా సురక్షిత మాతృత్వం సాధ్యమోతుందని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. పి.ఎం.ఎస్.ఎం.ఏ కార్యక్రమంలో భాగంగా బుధవారం తలుపుల పి.హెచ్.సిలో గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు, చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య పరీక్షలతో తల్లి బిడ్డ ప్రతికూల ఆరోగ్య సమస్యల అంచనా సాధ్యమని అన్నారు. గర్భిణీ కాలంలో కనీసం నాలుగు సార్లు వైద్యుల చేత ఆరోగ్య పరిక్షలు చేయించుకోవడం ద్వారా పిండంలోని శారీరక లోపాలు, పిండం ఎదుగుదల, తల్లిలో రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం, గుర్రపు వాతం మొదలగు గర్భిణి క్లిష్ట సమస్యలను ముందుగా తెలుసుకుని తగిన నివారణ చర్యలు తీసుకోవడంతో సురక్షిత మాతృత్వం సాధ్యమవుతుందని అన్నారు. కావున ఆరోగ్య పరీక్షల అవసరంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని ఆరోగ్య పరీక్షలకు సహకరించాలని డాక్టర్ సూచించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన గర్భవతులకు స్థానిక పి.హెచ్.సి లో విధులు నిర్వహిస్తున్న హంసవేణి సహాయ, సహకారంతో 26 మంది గర్భవతులకు పండ్లు, పాలు, బ్రెడ్డు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, కృష్ణయ్య, ఏఎన్ఎం నాగవేణి, ప్రమీల, సిహెచ్ఓ కుముద, ల్యాబ్ టెక్నిషియన్ కుమార్, ఆశ కార్యకర్తలు, గర్భవతులు పాల్గొన్నారు.

# డ్రైవర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త :



శిక్షణలో ఉన్న డ్రైవర్లతో డిపో మేనేజర్

ప్రజా రవాణా సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లు కొత్త బస్సుల నడపడంలో ఇస్తున్న శిక్షణను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఆర్టీసీ చీఫ్ మెకానిక్ ఆనంద్, పీలేరు డిపో మేనేజర్ నిర్మల తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ లో పీలేరు డిపోకు కొత్తగా వచ్చిన ఎనిమిది బిఎస్ 6 మోడల్ ఇంజన్ల బస్సులు నడపడంలో డ్రైవర్లకు అవసరమైన మెళుకువలతో చీఫ్ మెకానిక్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ మారుతున్న రహదారుల స్థితిగతులను అనుసరించి బస్సు ఇంజన్ల సాంకేతికతలో మార్పులు, చేర్పులు కంపెనీలు తెస్తున్నాయని, ప్రమాదాల నివారణకు డ్రైవర్లు వీటిపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకుని బస్సులు నడపడం చాలా అవసరమని సూచించారు. ప్రధానంగా గేర్లు మార్చడంలో పాత బస్సుల్లోకన్నా కొత్త వాటిలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించారని తెలిపారు. డిపో మేనేజర్ నిర్మల మాట్లాడుతూ ప్రస్తుతం పీలేరు డిపో నుంచి హోస్పేట, బెంగళూరు, శ్రీశైలం, రాయచోటితిరుపతి ప్రాంతాలకు నడుపుతున్న పాత బస్సుల స్థానంలో ఈ కొత్త బస్సులను నడపనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పీలేరు గ్యారేజ్ ఎం.ఎఫ్ హరినాథరెడ్డి, డ్రైవర్లు రమణ, వెంకటరమణ, సురేష్, సుబ్రహ్మణ్యం, మెకానిక్ లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నీటి సమస్య రాకుండా చూడాలి

పీలేరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త :



పీలేరు గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సర్పంచి డాక్టర్ షేక్ హబీబ్ బాష తెలిపారు. బుధవారం సర్పంచి తన కార్యాలయంలో వార్డు సభ్యులతో కలిసి వాటర్ మెన్ ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ప్రతి నాలుగు రోజులకు ఓసారి నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయాలని ఆదేశించారు. అలాగే పైపులైన్లు మరమ్మతులకు గురై నీరు ఎక్కడా వృధా కాకుండా దృష్టి సారించాలని సూచించారు. వీధుల వారీగా క్రమం తప్పకుండా ప్రజలకు నీరు అందించాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు విక్టరీ వెంకటరమణా రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, అబిద్, పరమేష్, వాటర్ మెన్లు వెంకట్రామయ్య, ఎల్లప్ప, బివి రమణ, వైఎస్ మస్తాన్, సుబ్రమణ్యం, నాగరాజ పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

ఎడ్యుకేషన్ ఏప్రిల్ 9 ప్రభాతవార్త:



పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని పిడియస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. .. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను పెంచి పేద ప్రజల పైన భారం మోపుతుందని ఆయన అన్నారు భారతదేశం వెలిగిపోతుంది పేదరికం లేని దేశంగా మారుతుందని కేంద్ర ప్రభుత్వం మోదీ విదేశీ పర్యటనలో మాట్లాడిన మాటలు నీటి బుడగలాగా అయ్యాయని అన్నారు పెంచిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు పెంచి పేదవారి నడ్డి విరచడమేనా మీరు చెప్పే మాటలు చేసే విధానాలు నీటి మీది బుడగలాగా అయ్యాయని ఆయన అన్నారు నిత్య అవసరవ ధరలు పెరిగి ప్రజలు సతమతమవుతున్నటువంటి పరిస్థితులలో వంటగ్యాసు ధర పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి ప్రజలను ఇంకొంచెం అణిచివేతకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు కార్మిక వర్గం పనులు లేక పొట్ట చేత పట్టుకొని పట్టణాలలకు పరుగులు తీస్తున్నారు అటువంటి పరిస్థితులలో వంట గ్యాస్ ధర పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి కార్మిక వర్గాన్ని మరింత పేదరికం లోకి నెట్టివేయబడుతుందని అన్నారు వెంటనే వంటగ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు జిల్లా నాయకులు ఖాదర్ భాష, భాస్కర్, నగరనాయకులు మనోజ్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్‌జి నర్సరీ తనిఖీ

రైల్వేకోడూరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త



గౌరవ పథక సంచాలకులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, అన్నమయ్య జిల్లా వెంకటరత్నం ఈ రోజు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ద్వారా నిర్వహించబడుతున్న ఎమ్‌జి నర్సరీ నీ తనిఖీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉపాధి పథక ఏపీఓ ఎస్.మృత్యుంజయరావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ డిపి గురవయ్య గారు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రసన్న ఇతర ఉపాధి సిబ్బంది హాజరు కావడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉపాధి పథక ఏపీఓ మృత్యుంజయరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రసన్న ఇతర ఉపాధి సిబ్బంది హాజరు కావడం జరిగినది.

# వేంపల్లె ఈవోను తక్షణమే నియమించాలి

వేంపల్లె: ఏప్రిల్ 09 (ప్రభాత వార్త);




జిల్లాలో మేజర్ పంచాయతీ అయిన వేంపల్లె కి ఈవో గత నెల రోజుల పైబడి లేకపోవడంతో పరిపాలన పడకవేయడంతో తీవ్ర నీటి ఎద్దడి తో పాటు సచివాలయ ఉద్యోగులకు ఒక నెల, పంచాయతీ శానిటేషన్ వాటర్ వర్క్స్ లో ఉన్నటువంటి కార్మికులకు నాలుగు నెలల వేతనాలు అందక నానా కష్టాలు పడుతున్నారని కలెక్టర్ దృష్టి సారించి ఈవో ను తక్షణమే నియమించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా విజ్ఞప్తి చేశారు. బుధవారం వేంపల్లె మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాదుల్లా మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారులు ఎంక్వయిరీలో సుబ్బారెడ్డిని మార్చి 7న సస్పెండ్ చేయడంతో పాటు మరో ఇద్దరి కార్మికులను తొలగించడంతో పాటు సర్పంచి చెక్ పవర్ సైతం రద్దు చేయడం జరిగిందని గుర్తు చేశారు. నెల రోజులు పైబడి ఈవో లేకపోవడంతో వేసవికాలం ప్రారంభముతో పాపాగ్నిలో మదినాపురం, రెడ్డి కాలనీ తదితర ప్రాంతాలలో బోర్ల లోని మోటర్లు కాలిపోవడంతో సాక్షాత్తు ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డిని ప్రశ్నించిన పరిస్థితిని నెలకొందన్నారు. జిల్లా కలెక్టర్ వేంపల్లె ఈవోను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

# అనర్థదాయక వ్యర్థాల పట్ల అప్రమత్తత అవసరం

వేంపల్లి: ఏప్రిల్ 09 (ప్రభాత వార్త):




కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల మీద అవగాహన ఏర్పాటు చేయడమైనదని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యోగాంజనేయులు తెలియచేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ ఎస్. నాగేంద్ర మాట్లాడుతూ విద్యుత్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాలను మరల ఉపయోగించకుండా పారవేసినప్పుడు వాటిని ఎలక్ట్రానిక్ వ్యర్థాలంటారని, వీటి ద్వారా భూమి, నీరు, వాతావరణం కలుషితమవుతుందని, ఇది పర్యావరణానికి పెనుముప్పుగా మారి వాతావరణ అసమతుల్యత ఏర్పడుతుంది. ఈ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలను, ఆరోగ్య సమస్యలను నివారించుటకు మూడు ముఖ్యమైన పద్ధతులు అవలంబించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. పివిల్. మాట్లాడుతున్న ప్రిన్సిపల్ యోగాంజనేయులు.

# బంగారు నగలు దొంగిలించిన వ్యక్తులు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైమ్, ఏప్రిల్ 9, ప్రభాత వార్త :



బంగారు గొలుసు దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేశామని త్రీటౌన్ సిఐ గోవింద రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక త్రీ టౌన్ పోలీసు స్టేషనులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం హోమస్ పేటలోని 7/307, ఇంటి నందు ఆయుర్వేదిక్ మందుల షాప్ నిర్వహిస్తున్న ఫిర్యాది అయిన ముంగర సుభాషిని, అనే వృద్ధురాలు ఒంటరిగా ఉండగా ముద్దాయిలు (ఒక మగ మరియు ఒక ఆడ వ్యక్తులు) మందులు కావాలనే నెపంతో ఇంటిలోనికి ప్రవేశించి సదరు వృద్ధురాలిని బెదిరించి ఆమె మెడలో ఉన్న సుమారు 25 గ్రాముల బంగారు గొలుసు మరియు బంగారు డాలర్ ను దొంగలించుకొని పోయారని సుభాషిణి ఫిర్యాదు పై ప్రొద్దుటూరు 3 పట్టణ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేయగా, ఈ కేసు విచారణలో భాగంగా ప్రొద్దుటూరు సబ్‌డివిజనల్ పోలీసు ఆఫీసర్ అయిన భావన ఆదేశాల మేరకు తన పర్యవేక్షణలో ఎస్సై యోగేంద్ర మరియు సిబ్బంది దస్తగిరి, సుబ్రహ్మణ్యం, బాల ఏసు, జనార్ధన్ రెడ్డి మహిళా కానిస్టేబుల్ సుధామనిలు పుర వీధులలో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించి వాటి ఆధారంగా బుధవారం ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో, వాసవి సర్కిల్ వద్ద వున్న బస్టాపు నందు ముద్దయిలైన చాపాడు మండలం బద్రిపల్లి గ్రామానికి చెందిన చిలంకూరి బాలయ్య, ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన శ్రీరామ ఏసురత్నమ్మ లను అరెస్టు చేసి వారివద్ద నుండి సుమారు 29 గ్రాముల గొలుసు మరియు బంగారు డాలర్ ను స్వాదిన పరచుకున్నామని వివరించారు. ముద్దాయిలను కేసు తదుపరి చర్య నిమిత్తం రిమాండుకు పంపామని తెలిపారు.

# మౌలిక వసతులు కల్పించాలి: సిపిఎం

పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్9 ప్రభాతవార్త:

సిపిఎం తలపెట్టిన ప్రజా చైతన్య యాత్ర లోబాగంగ సిపిఎం పార్టీ మండల కమిటి ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మార్వో ఆఫీస్ ముందు పోరుమామిళ్ల పట్టణ మండల సమస్యలు పరిష్కారం చేయాలని ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శియన్ .భైరప్రసాద్ మాట్లాడుతూ సిపిఎం పార్టీ మార్చి 20 తేది నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు సిపిఎం ప్రజా చైతన్య యాత్ర ప్రతి వార్డు వీధి కాలనీలలో సమస్యలు పరిష్కారం చేయాలని తిరగడం జరిగింది. ఆసందర్భంగా గుంటూరు బాపనయ్య కాలనీలో మంచినీటి సౌకర్యం, డ్రైవనేజీ, కరెంటు సౌకర్యము ఏమీ లేవని అలాంటి వారికి వెంటనే పట్టాలు మంజూరు చేసి సిమెంట్ రోడ్లు మంచినీటి సౌకర్యం డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ డిపిఓ అన్ని పంచాయతీలను పరిశీలించి కిందిస్థాయి అధికారులు చురకలంటిచ్చి పంచాయతీలను అభివృద్ధి బాటలో పెట్టాలనిన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మేరీ బీబీ ప్రసాదు,రవి ఓబులమ్మ దుర్గయ్య జేమ్స్ గురయ్య విజయ వెంకటలక్ష్మి లచ్చుమ సాయి ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, ANSER HUSSAIN SHAIK (OLD NAME) s/o SHAIK BUDDAN SAHIB, resident of 6/281-1Up Burandeen Street, Kadapa, AP. I changed my name to **ANSAR HUSSAIN SHAIK.** Henceforth, I will be known as **ANSAR HUSSAIN SHAIK.**

డాక్యుమెంట్ పోయినది

వన్నీ సాబ్ గారి హుస్సేన్ వల్లి తండ్రి హుస్సేన్ వల్లి ఇంటి న్నెం: 1/109 జంగాలపల్లి విలేజ్, పెద్దమడియం (మం) వై.ఎస్.ఆర్.,( జిల్లా) ఏపీ., పెద్దముడియం గ్రామంలో నా ప్రాపర్టీ సేల్ డీడ్ ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది నెం:3738/2020 దొరికిన వారు పై అడ్రస్‌కు తెలియజేయగలరు

# సంస్థాగతంగా బిజెపిని బలోపేతం చేయాలి

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)



పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటూ రాష్ట్రంలో అధికారం దిశగా అడుగులు వేయాలి పోతు గుంట రమేష్ నాయుడు బుధవారం రాజంపేట బి జెపి కార్యాలయంలో జరిగిన పార్టీ క్రియాశీలక సభ్యుల సమావేశంలో పేర్కొన్నారు. బిజెపి అధ్యక్షులు సాయి లోకేష్ అధ్యక్షతన పార్టీ క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసుకుంటూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకుని వెళ్లి ప్రజలను చైతన్యవంతులు చేస్తూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిలో భాగస్వాములు అయినా కూడా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటూ పటిష్టమైన బూత్ కమిటీలు మండల కమిటీలు జిల్లా కమిటీలు వివిధ మోర్చాల కమిటీలు వేసుకొని కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకు తీసుకొని వెళ్లి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సీట్లు బిజెపి సాధించే విధంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి కృష్ణ యాదవ్ ఆనంద గజపతిరాజు అసెంబ్లీ కన్వీనర్ కో కన్వీనర్ రామ జగదీష్ మరియు డాక్టర్ రాంప్రసాద్ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మస్తానయ్య ఒంటిమిట్ట చెరువు సంఘం అధ్యక్షులు గంగిరెడ్డి బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ బిజెపి ఎస్సీ మూర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణయ్య ప్రభాకర్ అసెంబ్లీలోని అన్ని మండల అధ్యక్షులు వివి రమణ ప్రసాద్ రెడ్డి భాను ప్రకాష్ రాజు శ్రీనివాసులు అనంతరాజు మహేష్ గౌడ్ తదితర కార్యకర్తలు క్రియాశీలకు సభ్యులు పాల్గొన్నారు.

# ఎవరు అడ్డుపడినా రోడ్ల విస్తరణ చేసి తీరుతా : ఎమ్మెల్యే వరద



ప్రొద్దుటూరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త

పురపాలక సంఘం సాధారణ పాలకమండలి సమావేశంలో పలు అంశాలపై సభ్యుల మధ్య వాడి వేడిగా చర్చ జరిగింది. బుధవారం చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు ఆరోగ్య కారణాల దృష్ట్యా సమావేశానికి గైర్హాజర్ కావడంతో మున్సిపల్ కమిషనర్ సమావేశానికి అధ్యక్షత వహించాల్సిందిగా వైస్ చైర్మన్ సిఎస్ ఖాజా మొహిద్దీన్‌ను ఆహ్వానించారు. ఇన్చార్జి చైర్మన్ సి ఎస్ ఖాజా మొహిద్దీన్ అధ్యక్షతన సాధారణ మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆఫీసియో సభ్యులుగా స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు 53 అంశాలతో కూడిన సాధారణ అజెండాను పొందుపరిచారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభంలోనే చైర్మన్ ఖాజా మాట్లాడుతూ పాలకమండలి సమావేశంలో అధికారులు కౌన్సిల్ సభ్యులు పాత్రికేయులు తప్ప ఇతర వ్యక్తులు ఎవరున్నా బయటకు వెళ్లిపోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై కౌన్సిల్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసు కోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ నేపథ్యంలో ఇంచార్జి చైర్మన్ సీఎస్ ఖాజా మొహిద్దీన్ సమావేశాన్ని 20 నిమిషాల పాటు వాయిదా వేశారు. అక్కడే ఉన్న పోలీసులు సభ్యులను వారించి వారి వారి స్థానాలకు పంపించడంతో వాగ్వివాదం సద్దుమణిగింది. వాయిదా అనంతరం ప్రారంభమైన సమావేశంలో పలు కీలక అంశాలపై సభ్యుల మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రధానంగా మున్సిపల్ స్థలాల ఆక్రమణ పై కౌన్సిలర్ ఇర్ఫాన్ భాష లేవనెత్తారు. తన 13 వార్డులో ఆక్రమణలు జరుగుతున్నాయని కొన్ని నెలల నుండి అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు ఒక్కొక్క కమిషనర్ ఒకరకంగా సమాధానం చెప్పడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా సర్వేయర్‌తో కొలతలు చేయించి అక్రమంగా జరిగిందా లేదా తేల్చాలన్నారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ అందుకు తగ్గ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన నేపథ్యంలో 21 వ వార్డు కౌన్సిలర్ నాగేంద్రారెడ్డి తన బంధువులకు చెందిన సమాధులను తమ అనుమతి లేకుండా మున్సిపల్ అధికారులు ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఈ అంశంపై కల్పించుకున్న ఎమ్మెల్యే వరద పట్టణంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం ఎన్ని అడ్డంకులు వచ్చినా రోడ్ల విస్తరణ పనులు చేసి తీరుతామని తెలిపారు. వేసవి కాలం రావడంతో త్రాగునీరు సమస్య ఎక్కువగా ఉందని అందుకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వ్యతిరేకించకుండా ఏకగ్రీవంగా ఆమోదం తెలపాలని సభ్యులు కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పట్టణ ప్రణాళిక అధికారులు ఇంజనీరింగ్ విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి నశించాలి

బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 09 ప్రభాత వార్త :



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు గ్యాస్ బండతో శవయాత్ర చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి అంతర్జాతీయ ముడి చమురు ధరలకనుగుణంగా ధరలను తగ్గించాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నదన్నారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు పెంచి, తగ్గినప్పుడు ధర తగ్గించకపోవడం ప్రజలను వంచించడమేనని ధ్వజమెత్తారు. పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని లేకపోతే రానున్న కాలంలో ప్రజా మద్దతుతో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ షరీఫ్, గంప అనంతమ్మ, పసుపుల మోక్షమ్మ, శాఖా కార్యదర్శులు షేక్ మస్తాన్ బీ, షేక్ ఆదిల్, ముడియం నరసింహ నాయకులు నాగార్జున, బాల గురయ్య, ఓబుల్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు టిడ్కో ఇండ్లు ఎప్పుడు ఇస్తారో?

యర్రగుంట్ల ఏప్రిల్ 9 ప్రభాతవార్త



మండల కార్యాలయం బుధవారం తాహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ నేతృత్వంలో నిరసన కార్యక్రమం చేపటారు. మాట్లాడుతూ పేదవాడి ఇళ్ల గురించి గొప్పగా చెప్పే పాలకులు చేతల్లో విఫలమవుతున్నారని, కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇళ్ల సమస్యలను నిర్దిష్ట కాలపరిమితి తో పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ రెండు సెంట్ల ఇళ్ళ స్థలాలు, టిడ్కో ఇల్లు ఇవ్వాలని మాట్లాడుతూ ఇళ్ళు లేని పేదలకు అర్హులైన ప్రతి ఒక్కరికి పట్టణ ప్రాంతాల్లో రెండు సెట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇండ్ల స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని, పెండింగ్ పనులను పరిపూర్తి చేసి లబ్ధిదారులందరికీ టిడ్కో ఇండ్లు వెంటనే స్వాధీనం చేయాలని సిపిఐ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టిందన్నారు. ఈ విషయంపై గత నెలలో అన్ని మండల రెవెన్యూ, జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సిపిఐ ఆధ్వర్యంలో అందజేశామని అర్జీలు అన్నింటినీ పరిశీలించి అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం, ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి శరత్, గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు ఎన్ వెంకట్ రాముడు, సిపిఐ మండల సమితి సభ్యులు బియ మ్ షరీఫ్, బి ప్రతాప్, ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు గంగమ్మ, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు లీలకృష్ణా, ఎన్టీఆర్ నగర కాలనీ వాసులు బ్రహ్మం రెడ్డి, గురువయ్య, శివారెడ్డి, మహేష్, ఈశ్వరయ్య, చిలమాకూరు మహిళా సమాఖ్య నాయకురాలు అనురాధ జగనన్న కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పొదుపు చేయడం ద్వార ఆర్థిక పురోగతి

సుండుపల్లి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:



మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆర్‌హెచ్ జిబి ఎంఎస్ఎస్ సంస్థ ప్రతినిధి బివి రత్నం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశమునకు మండలంలోని అన్ని గ్రామాల నుండి రైతులు రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ హెచ్ జి పి ఎం ఎస్ ఎస్ సంస్థ ప్రతినిధి బివి రత్నం మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత గురించి మరియు రైతులకు పొదుపు ఎలా చేయాలో పొదుపు చేసినటువంటి డబ్బులను తమ అవసరాలకు ఎలా ఉపయోగించుకోవాలో ఆర్థికంగా ఎలా బలపడాలో తెలియజేయడం జరిగింది. మండలాధ్యక్షురాలు రాజమ్మ మాట్లాడుతూ ఆర్థిక అసమాతల గురించి పొదుపు గురించి రైతులకు ఈ విధంగా అవేర్నెస్ క్యాంపులు పెట్టి తెలియజేయడం చాలా సంతోషకరమన్నారు. ఎంపీడీవో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత అనేది చాలా ముఖ్యమైన సందేశం అన్నమాట ఎందుకంటే ప్రతి ఒక్కరూ చదువుకొని ఆర్థికంగా బలపడుతుంటే సమాజం బాగుపడుతుంది దేశం బాగుపడుతుంది కాబట్టి ఈ ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై మరి ఇలాంటి క్యాంపులు పెట్టుకోవడం చాలా ఆనందదాయకమని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్ ముబారక్, ఎం బాబు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం ఎదురుచూపులు

రాయచోటి ఏప్రిల్ 9 ప్రభాతవార్త



మండల పరిధిలోని విజయనగరం కాలనీలో తాగునీటి కోసం ఆ గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు గ్రామలో ఉన్న ఒకా నొక వాటర్ స్కీం లో భూగర్భ జలాలు అడుగంటి పోవడం వల్ల త్రాగునీటి కోసం కాపు కాయాల్సి వస్తుందని వారు ఆరోపిస్తున్నారు. గత కొంతకాలంగా తాగునీరు అసలు రావడంలేదని ఉన్న అరకొర కూడా సక్రమంగా రావడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. సుమారు 60 కుటుంబాల వరకు జీవనం కొనసాగిస్తున్నారు అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 10 బిందెలు కూడా రావని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు పట్టించుకోని తమకు తాగనీటి దాహాన్ని అందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

సుండుపల్లి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:



మండల పరిధిలోని పెద్దమాదిగపల్లి మండల పరిషత్ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి 2 రవీంద్ర నాయక్ సందర్శించడం జరిగింది. కొత్త పిల్లల నమోదు కొరకు ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు తో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నారని, విద్యార్థులకు భవిష్యత్తులో చక్కటి పునాది ప్రభుత్వ పాఠశాలలో ఉంటుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు (యూనిఫాము, టెక్స్ట్ బుక్స్, మిడ్ డే మీల్స్, యోగ, రాగి జావా, చిక్కి) వల్ల పిల్లలు గుణాత్మకత పెంపొందడానికి ఉపయోగపడతాయని, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు గురించి తల్లిదండ్రులతో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మురళీధర్ రాజు, జి. శాంతి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించుటకు కరపత్రాలు కూడా పంచిపెట్టారు.

## చెత్తను డస్ట్ బిన్‌లోనే వేయండి

పుల్లంపేట ఏప్రిల్ 9( ప్రభాతవార్త)



వీధిలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

పుల్లంపేట గ్రామ పంచాయతీలోని వీధులలో చెత్తను పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య ఆధ్వర్యంలో బుధవారం తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా ముత్తయ్య మాట్లాడుతూ ప్రజలంతా చెత్తను రోడ్లపై వేయొద్దని డస్ట్ బిన్ లోనే ఉంచుకొని గ్రీన్ అంబాసిడర్లకు మాత్రమే అందజేయాలని కోరారు. ఒకసారి వాడి పడేసిన ప్లాస్టిక్ గ్రామపంచాయతీ నందు నిషేధించడం జరిగిందని ఎవరు కూడా వాడిని వాడవద్దని అమ్మవారిని కొనవద్దని తెలియజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యానికి కాపాడుకోవచ్చని ఆయన వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది నరసింహులు శంకరయ్య గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

## మే 2న ఉచిత ఉపనయనాలు

పీలేరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త :

పీలేరు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఉపనయన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తెనాలి శేషగిరిరావు, ఉద్యా ఫణీంద్ర శర్మ తెలిపారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శ్రీ కంచి కామకోటి పీఠం ఆదేశాల మేరకు, శ్రీ జగద్గురు ఆ ది శంకరాచార్యుల జయంతి సందర్భంగా మే 2న పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 17వ ఉచిత బ్రాహ్మణ సామూహిక ఉపనయన కార్యక్రమం నిర్వహించనుందని అన్నారు. మే 2న ఉదయం 6 గంటలకు నాంది, ఉదయం 8:20 గంటలకు వటువులకు బ్రహ్మోపదేశం, మధ్యాహ్నం 12:30 గంటలకు పట్టణ ప్రధాన వీధుల్లో జగద్గురు ఆది శంకరాచార్యుల చిత్రపటంతో శోభాయ యాత్ర జరగనుందని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన బ్రాహ్మణ వటువులు ముందుగా తమ పేర్లను ఏప్రిల్ 25 లోగా నమోదు చేసుకోవాలని పీలేరు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు తెలియజేశారు. వివరాల కోసం సెల్ నెంబర్లు 9346437672, 8179962025 కు సంప్రదించాలని కోరారు.

## భవన నిర్మాణ కార్మికుల సమావేశం

యర్రగుంట్ల ఏప్రిల్ 9 ప్రభాత వార్త



పట్టణంలో బుధవారం ఎపి. భవన నిర్మాణ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం సీనియర్ నాయకులు యస్. రాధాక్రిష్ణ మాట్లాడుతూ గత 6 సంవత్సరాలుగా సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అందవలసిన 12 రకాల సంక్షేమ ఫలాలు అందడం లేదని తక్షణమే సంక్షేమ బోర్డును పునరుద్దరించి, మెరుగైన సంక్షేమ ఫలాలను అందివ్వాలని డిమాండ్ చేస్తూ 11 తేదీన శుక్రవారం కమలాపురం కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. ఈ ధర్నాకు భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాదెండ్ల కాశిమ్ పీరా, ఆళ్లగడ్డ సురేష్, ఎలక్ట్రిషన్ రవి, గోగుల చిరంజీవి కోటం, శ్రీనివాసులు, కె బాబు, లక్ష్మీనారాయణరెడ్డి, సాధక్ రామాంజనేయులు, శివ, సుభాన్ బాషా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రాయచోటి ఏప్రిల్ 9 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నమయ్య జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు డివిటి పద్మా యాదవ్ అన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో పాలనలో ఎక్కువ అక్రమాలు చోటు చేసుకున్నాయని అధికార యంత్రాంగాన్ని కూడా తన సొంత పార్టీ నాయకుల్లాగా అధికారులను ఉపయోగించుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదల పక్షాన ఉంటూ పేదలకు అవసరమైన సంక్షేమ పథకాలను ఇవ్వడమే కాకుండా అభివృద్ధి వైపు దూసుకెళున్నారు అన్నారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి ఉన్నప్పుడే బీసీల సంక్షేమ బీసీలకు కావలసిన అభివృద్ధి అంతా కూడా చేయడం జరుగుతుందన్నారు.

## వర్మీ కంపోస్ట్ యార్డ్ పరిశీలించిన ఎంపీడీవో

పుల్లంపేట ఏప్రిల్ 9 ( ప్రభాతవార్త)



మొక్కలు నాటుతున్న దృశ్యం

మండల కేంద్రం లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో వరప్రసాద్ బుధవారం పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో చర్చ నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగం లోకి తీసుకురావాలన్నారు. వర్మి కంపోస్టు తయారీ విధానాన్ని ఆయన పరిశీలించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో ఆవరణంలో ఆయన మొక్కల నాటడం జరిగింది. అన్ని గ్రామ పంచాయతీల తాగునీటి ఎదురులేకుండా తగు చర్ల చేపట్టాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం పరిపాలన అధికారి శ్రీధర్ రెడ్డి, ఇన్చార్జి విస్తరణ అధికారి ముత్తయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు చెత్త నుండి సంపద కేంద్రాలను ఎంపీడీవోతోపాటు సందర్శించారు.

## మోయడానికి మేమున్నాం

జమ్మలమడుగు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:

కొండ సుంకేసుల గ్రామం నందు మెంట రాజేశ్వరరావు(74) అనారోగ్యంతో మృతి చెందగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుసేన్‌ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి బుధవారం సాయంత్రం హిందూ స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు, టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుసేన్, సీఈవో మల్లికార్జున, వలీ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## తోపుడు బండి వితరణ

ప్రొద్దుటూరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త



పట్టణానికి చెందిన కసితా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపేట గ్రామానికి చెందిన కొడతాల సునీల్ కుమార్ రెడ్డి 14000 రూపాయల విలువచేసే తోపుడు బండిని ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై ఆర్థిక తోబుతా లేక ఇబ్బంది పడుతున్న ఎర్రగుంట్లకు చెందిన భాస్కర్ కు బుధవారం వితరణ గావించారు. ఈ సందర్భంగా సూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ భాస్కర్ కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి సహృదయంతో తోపుడు బండిని అందించిన సునీల్ కుమార్ రెడ్డిని ఆమె అభినందించారు ఈ కార్యక్రమంలో శూలం శివప్రసాద్ సుబ్బయ్య ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానంబికా డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

మదనపల్లెక్రైమ్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త.



జ్ఞానంబికా డిగ్రీ కళాశాలలో రెస్పాండెంట్ రాకకుండా గురు ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరము కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా వచ్చి 57 యూనిట్ల రక్తాన్ని ఇవ్వటం జరిగింది. వివరంగా వచ్చిన 57 యూనిట్లను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి రక్త నిధి కేంద్రముకు అందజేశారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ మాట్లాడితే అన్ని దానాల్లే కన్నా రక్తదానం చాలా గొప్పదని, ప్రమాద సమయంలో ఎంతోమందికి ప్రాణదానం చేసే ఘనత రక్తదాతలకే దక్కుతుందన్నారు. రక్తదానం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. రక్తదాన శిబిరము విజయవంతంగా నిర్వహించినందుకు విద్యార్థులను, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ హేమ శేఖర్, ఉదయ్ కుమార్, రక్త నిధి కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్, రక్త నిధి కేంద్ర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెంచిన ధరలు వెంటనే ఉపసంహరించాలి

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 09 ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరను ఉపసంహరించుకోవాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఐదు రోడ్ల కూడలిలో ధర్నా చేసి ఈ సందర్భంగా గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లకు ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.50 పెంపు దారుణం అని ఇప్పటికే దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న దశలో నిత్యవసరాలైన గ్యాస్ ధరను పెంచడం ప్రజల నెత్తిన బండవేయడమే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి పెంచినటువంటి పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని లేనిపక్షంలో ప్రజలతో కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు సిద్ధమవుతామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు భాస్కర్, వీరనారాయణ, రమణ, ఆనందరావు, ఆంజనేయులు, చినబ్బి, రామకృష్ణరెడ్డి, చక్రవర్తి, ఆటో యునియన్ నాయకులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాల సందర్శన

కురబలకోట, ఏప్రిల్ 9 ప్రభాతవార్త



జిల్లా సహాయ బాలికా అభివృద్ధి అధికారి బి. శిరీష బుధవారం అన్నమయ్య జిల్లా, కురబలకోటలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె 9వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, ముందుచూపు కార్యక్రమం సంబంధించి నోటు పుస్తకాలు పరిశీలించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో చూపిన చొరవను ఆమె అభినందించారు. తర్వాత, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, పాఠశాల సమగ్రాభివృద్ధికి దోహదపడే విలువైన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రఫియా పర్వీన్, బోధనా సిబ్బంది నిర్మలమ్మ, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, శ్రావణి, షబానా, పుష్పలత, సుమలత, రత్నప్రియ, రమణమ్మ, భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

వాల్మీకిపురం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:

స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ భవనంలో నేడు గురువారం ఉదయం 10గంటలకు ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో మనోహరరాజు తెలిపారు ఈ సమావేశంలో మండల అభివృద్ధిపై చర్చించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా వేసవికాలం ఉన్నందున తాగునీటి పై సమీక్షంచడం జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు విరివిగా హాజరుకావాలని కోరారు.

## జయచంద్రారెడ్డి చొరవ చంద్రబాబు దాతృత్వం

తంబళ్లపల్లె ఏప్రిల్ 9 ప్రభాతవార్త ః



నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి చొరవతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దాతృత్వంతో ఇచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుతో ఓ మాజీ సర్పంచ్ ఆరోగ్యం నిలవడం హర్షనీయం. తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తాండ మాజీ సర్పంచ్ సిద్ధమల్ రెడ్డి అనారోగ్యం తో బాధపడి ఆసుపత్రిలో చికిత్సలు పొందాడు. ఈ విషయాన్ని మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, పెద్దరు ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్, క్లస్టర్ ఇన్చార్జిలు బేరి శ్రీనివాసులు, రెడ్డి కోట బిఎంఆర్, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి నాయుడు లు తంబళ్లపల్లె ఇంచార్జ్ జయచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సిద్ధమల్ రెడ్డి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం రూ 32.900 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు చేయించారు. ఈ చెక్కును బుధవారం మొలకలచెరువు టిడిపి ప్రధాన కార్యాలయంలో జయచంద్రారెడ్డి సిద్ధమల్ రెడ్డికి అందించారు. చెక్కు అందుకున్న సిద్ధమల్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు జయచంద్రారెడ్డి మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటి దారిని ఆక్రమించేశారు

### న్యాయం చేయండి అంటూ ఎస్టీల ఆవేదన

పీలేరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త:



తహసిల్దార్ కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

తమ ఇంటికి దారి లేకుండా ఆక్రమించేసారని పీలేరు మండలం జాండ్ల పంచాయితీ నల్లగుట్టపల్లె తండాకు చెందిన లేట్ శ్రీరాములు నాయక్ భార్య పార్వతి బుధవారం పీలేరు తహసిల్దార్ భీమేశ్వరరావుకు ఫిర్యాదు చేసింది ఈ ఫిర్యాదు మేరకు ఇదే గ్రామానికి చెందిన పార్వతికి వారసత్వంగా సర్వేనెంబర్ 227/17 నాలుగు సెంట్లు ఇంటి స్థలం ఉంది ఇది ఇలా ఉంటే పార్వతి గత కొన్ని నెలలుగా బ్రతుకుతెరువు నిమిత్తం వేరే ఊరికి వెళ్ళింది కొంతకాలానికి స్వగ్రామం వచ్చి చూడగా తమ ఇంటికి అడ్డంగా దారి లేకుండా రాతి కూసాలు ఏర్పాటు చేసి దారి లేకుండా చేసి ఉండడాన్ని ఆమె గుర్తించింది. ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి ఇంటికి దారి లేకుండా చేశాడని గుర్తించిన పార్వతి ఆయన దగ్గరికి వెళ్లి అడిగింది. ఎవరికి చెప్పుకుంటారు చెప్పుకోండి అంటూ దౌర్జన్యానికి దిగాడు. దీంతో భయపడి పోయిన పార్వతి చేసేది లేక పీలేరు తహసిల్దార్ భీమేశ్వరరావుకు ఫిర్యాదు చేసింది ఇదిలా ఉంటే వ్యక్తి తండావాసులకు అధికారికంగా కేటాయించిన స్మశాన వాటిక సైతం కొంచెం కొంచెం ఆక్రమించేస్తున్నట్లు ఫిర్యాదుల పేర్కొన్నారు. దీంతో తండావాసులు స్థిర నివాసాలకు వెళ్లే దానికి దారి లేక ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోతున్నారు ఫిర్యాదులు పరిశీలించిన తహసిల్దార్ పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పారు.

## కడప పురుషుల కేంద్ర కారాగారం విజిట్

కడప లీగల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:



ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్. బాబాఫకృద్దీన్ కడప పురుషుల కేంద్ర కారాగారం విజిట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు దోషిగా నిర్ధారించినప్పటికీ ఖైదీ ఇంకా భారత సుప్రీం కోర్టులో అప్పీల్ దాఖలు చేయని విషయం, ఖైదీలతో మాట్లాడుతూ శిక్ష నుంచి ఉపశమనం పొందేందుకు అర్హత ఉన్న ఖైదీలను గుర్తించడం, ఖైదీలు ఇంకా అప్పీలు దాఖలు చేయని విషయాలు ఖైదీలు శిక్ష కాలంలో సగం లేక సగానికి పైగా జైల్లో ఉండి బెయిల్ ప్రార్థనను హైకోర్టు తిరస్కరించిన విషయాలు ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలు మొదలైన అంశాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది ఎం. చంద్రకాంతమ్మ, పురుషుల కేంద్ర కారాగారం సూపరింటెండెంట్, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించండి

ప్రొద్దుటూరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త



గత నాలుగు సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ జెండా మోసి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికి పదవులలో సముచిత స్థానం కల్పించాలని డాక్టర్ జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డి కోరారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన నేరుగా కలిశారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి మరియు కార్యకర్తల సంరక్షణపై ఆయన ముఖ్యమంత్రితో చర్చించారు గత వైసిపి పాలనలో ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై బరాయించిన అక్రమ కేసులు రౌడీషీట్లు తొలగించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ నిర్మాణం కోసం మున్సిపాలిటీ నిధులు కొరత కారణంగా ప్రభుత్వమే నిధులు మంజూరు చేసి పూర్తిచేయాలని కోరారు ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం 500 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పాలన జరిగిన అవినీతి అక్రమాలపై సిద్ వేసి విచారణ జరిపించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రవీణ్ రెడ్డి విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

## ప్రయాణికులు త్రాగునీరు కోసం ఇబ్బందులు

మైదుకూరు, ఏప్రిల్ 09, ప్రభాతవార్త:



బస్టాండులో ప్రయాణికులు త్రాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నారు. పట్టణవాసులు ప్రయా ణ్రికుల త్రాగునీరు కోసం స్టాండ్ ఏర్పాటు చేసి ఫ్రిడ్జ్ అందజేసిన వాటిలో త్రాగునీరు లేక ఎండలు తీవ్రంగా ఉండడంతో వాటర్ కోసం ప్రయాణికులు అక్కడికి రావడం కాళీ వాటర్ తో నీరు లేకపోవడంతో వెనుతిరిగి ఇబ్బందులకు గురి అవుతున్నారు. త్రాగునీరు కోసం రోజువారీగా వాటర్ క్యాన్లు దాతలు ఎవరైనా సహకరిస్తే ప్రయాణికులకు దాహార్తి తీర్చినట్లు ఉంటుందని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

# శ్రీరామ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించిన టిటిడి అదనపు ఇఓ

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :

ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరుగనున్న శ్రీసీతారాముల కల్యాణం ఏర్పాట్లను టిటిడి తిరుపతి జేఈవో వి. వీరబ్రహ్మంతో కలసి టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీకోదండరామ స్వామి కల్యాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న సందర్భంగా, ఒంటిమిట్టలో ముఖ్యమంత్రివర్యులు పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. ముందుగా ఒంటిమిట్టలోని టిటిడి అతిథి గృహం వద్ద ముఖ్యమంత్రివర్యులు బస చేసే గదులలో ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ కోతలు లేకుండా అప్రమత్తంగా ఉండాలని, పరిసర ప్రాంతాలలో పచ్చదనం, పుష్పాలంకరణలు తాజా పుష్పాలతో ఏర్పాటు చేయాలన్నారు. అటు తర్వాత టిటిడి అతిథి గృహం నుండి ఆలయం వరకు పరిసర ప్రాంతాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఆలయంలోపుల ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో నిల్వ వున్న సామాగ్రి, వస్తువులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆలయం అంతా కలియ తిరిగారు. ఆలయం నుండి కల్యాణ వేదిక వరకు విద్యుత్ కాంతులు, పుష్పలంకరణలలో రాజీ లేకుండా నాణ్యంగా పనులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో జిల్లా యంత్రాంగం, టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. భక్తులు అందరికి అన్నప్రసాదాలు, స్వామివారి కల్యాణ తలంబ్రాలు, శ్రీవారి లడ్డు ప్రసాదం, త్రాగునీరు, మజ్జిక పంపిణీ చేస్తామని చెప్పారు. భక్తుల రద్దీకి తగ్గట్లు జిల్లా రెవిన్యూ, పోలీసు, స్థానిక పంచాయతీ, టిటిడి అధికారులు సమిష్టిగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు ప్రవేశించే, నిష్క్రమణ ప్రాంతాలలో మరింత అప్రమత్తంగా అధికారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సీఈ శ్రీ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. మరయపు కడప ఎస్పీ అశోక్ కుమార్ కూడా సీఎం రాక సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను బుధవారం పర్యవేక్షించారు. ఒంటిమిట్ట శ్రీ సీతారాముల కల్యాణానికి తిరుమల లడ్డూలు సిద్ధం ఒంటిమిట్ట శ్రీ సీతా రాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు సిద్ధమయ్యాయి. తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ – 2లో బుధవారం శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకింగ్ నిర్వహించారు. డిప్యూటీ ఈవో శివప్రసాద్, ఏఈవో బాలరాజు ఆధ్వర్యంలో దాదాపు 300 మంది మహిళా, పురుష శ్రీవారి సేవకులు 70 వేల లడ్డూలను ప్యాకింగ్ చేశారు. ఒంటిమిట్టలో జరుగుతున్న శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11వ తేదీ సాయంత్రం 6:30 నుంచి 8:30 గంటల మధ్య అత్యంత వైభవంగా జరిగే రాష్ట్ర పండుగ శ్రీ సీతా రాముల కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఈ లడ్డూలను ప్రసాదంగా అందజేయనున్నారు.


సీఎం రాక సందర్భంగా బందోబస్తు పర్యవేక్షిస్తున్న కడప ఎస్పీ అశోక్

# మిట్స్ విద్యార్థుల ప్రతిభ



కురబలకోట ఏప్రిల్ 9 ప్రభాతవార్త

మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లి నందు బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగానికి చెందిన రెండవ సంవత్సర విద్యార్థులు ఆర్. భావన మరియు కె. గౌతమీ ప్రియా తిరుపతి సమీపంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన ఆవిష్కార్ 2025 పోటీలలో మహిళల భద్రత కోసం తి। ఆధారిత కెమెరాలు" అనే కీలక అంశంపై పరిశోధన పత్ర ప్రదర్శనలో ప్రతిభ కనపరిచి మొదటి బహుమతిగా 2000 నగదు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మహిళల భద్రతపై ప్రభుత్వాలు మరియు సమాజం తీవ్రంగా ఆలోచిస్తున్న సమయంలో, ఈ తరహా సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత పరిష్కారాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలియజేశారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను కరెస్పాండెట్ డాక్టర్. యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, విభాగాధిపతి పద్మ, శాయిజ్ అహమ్మద్ అభినందనలు తెలియజేశారు.

# డ్రాపౌట్స్ విద్యార్థులపై దృష్టి పెట్టాలి




సంబేపల్లి ఏప్రిల్ 9 ప్రభాతవార్త

పాఠశాల యుడైస్ కు సంబంధించి డ్రాప్ బాక్స్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం సూచించారు. బుధవారం ఉదయం సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల పేర్లు డ్రాప్ బాక్స్ లో ఉంచరాదన్నారు. అలా ఉండే విద్యార్థులను తిరిగి చేర్చుకొని వారితో ఫోటో దిగి ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. హాజరు పట్టీలోని విద్యార్థుల వివరాలు, ఆన్లైన్లోని విద్యార్థుల వివరాలతో సరిపోవాలన్నారు. హెచ్చుతగ్గులు లేకుండా ఒకే విధంగా ఉండాలన్నారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులో ఖాళీలు లేకుండా విద్యార్థులకు సంబంధించిన అన్ని వివరాలు పూర్తిగా నమోదు చేయాలన్నారు. ఈనెల 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు విద్యార్థుల నమోదు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. కావున ముందస్తుగా పాఠశాల హ్యాబిటేషన్ పరిధిలోని ఒకటవ తరగతిలో చేరబోయే విద్యార్థుల వివరాలను ఆ గ్రామంలోని అంగన్వాడీ కార్యకర్తల ద్వారా సంబంధిత ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలుసుకొని నమోదు చేసుకోవాలన్నారు. పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అపార్ ఐడి వచ్చే విధంగా చూడాలన్నారు. పాఠశాలలో ప్రస్తుతం చదివే విద్యార్థులందరూ డ్రాప్ అవుట్స్ కాకుండా 100 పై తరగతులకు వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మిళిత విద్య జిల్లా కోఆర్డినేటర్ జనార్ధన్, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

చాపాడు. ఏప్రిల్ 9. ప్రభాతవార్త..



మండలంలోని చియ్యపాడు గ్రామం నందు శ్రీరామనవమి సందర్భంగా గత రెండు రోజుల నుండి కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం గరుడ వాహనంపై కోదండ రాముడు కొలువు దీరనున్నాడు. గురువారం రథోత్సవం, శుక్రవారం శేష వాహనం, పాన్పు సేవతో ఉత్సవాలు ముగియనున్నట్లు కార్య నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు.

# పశువుల తొట్టె నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

కలికిరి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:

మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు ఉపాధి హామీ పథకంలో నిధుల ద్వారా మంజూరైన పశువుల తొట్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఏపీవో మంజుల పేర్కొన్నారు. పంచాయతీల్లో జరుగుతున్న పశువుల తొట్ల నిర్మాణ పనులను ఏపీవో పరిశీలించారు. మండలంలోని 14 పంచాయతీలకు గాను 28 తొట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. పంచాయతీలలో పశువుల తొట్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మరికొన్ని చోట్ల నిదానం జరుగుతున్నట్లు తమకు ఆదేశాలు అందాయని జిల్లా స్థాయి అధికారులు నిర్దేశించిన లక్ష్యం మేరకు పశువుల తొట్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, ప్రజా ప్రతినిధులకు, రైతులకు సూచించారు. మర్రికుంటపల్లెలో జరుగుతున్న పనులను టెక్నికల్ అసిస్టెంట్ పద్మావతమ్మ పరిశీలించారు.




# ఓబిలి గ్రామ సమస్యలు పరిష్కరించండి



పెనగలూరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త

పెనగలూరు మండలం ఓబిలి గ్రామపంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించాలని ఓవిలి గ్రామం ముస్లిం మైనారిటీ యువత బుధవారం ప్రభుత్వ విప్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కు విన్నవించారు. క్రియేటినుండి ఇసుక తీసుకుపోతున్న ట్రాక్టర్ల వల్ల దుమ్ము ధూళితో ప్రజల ఇబ్బంది పడుతున్నారని దీని ని నివారించాలని కోరారు. అలాగే ఓబిల్లి దిగువ హరిజనవాడకు రక్షిత మంచినీరు సరిగా అందటం లేదని వెంటనే వేసి జి ఎల్ ఎస్ ఆర్ ద్వారా తాగునీరు అందించాలని కోరారు. జడవారిపల్లి హరిజనవాడలో నివసిస్తున్న దళితులందరికీ భూములు లేవని దళితులందరికీ సాగు భూములు ఇప్పించాలని కోరారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఓబిలి చెరువులోని కంప చెట్లను తొలగించాలన్నారు. రాజంపేట పెనగలూరు రహదారిలోని అతిగారిపల్లి కోదండ రామస్వామి ఆర్చి దగ్గర నుంచి గ్రామం వరకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఓబిలి మాజీ సర్పంచులు ఎస్ హబీబుల్లా , అరిఫ్ బాబు, ఎస్ అ మీరుల్లా, ఎస్ హుసేం, ఎస్ ఖాజావలి, జడ చిన్నయ్య బి శివ,నాగేంద్ర, సద్దాం,అరిఫ్, తాజు ,హుస్సేన్ షబ్బీర్ ,సాదిక్ గౌస్ భాష,మొహిద్దిన్, సాదిక్, ఉస్మాన్ ఫజుల్లా, శ్రీనివాసులు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

# కోదండ రాముడు సన్నిధిలో వాసు, మాధవి



రాజంపేట అర్బన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త

రాష్ట్రముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు సీతారాముల కల్యాణానికి విచ్చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాస్ రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి బుధవారం ఒంటిమిట్టకు విచ్చేశారు. వారికి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు కోదండ రాముని దర్శించుకున్నారు. ఒంటిమిట్టలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్ల గురించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేడా విజయశేఖర్ రెడ్డి, డాక్టర్ నేలటూరు మధుసూదన్ రెడ్డి, మండల వైస్ ఎంపీపీ నల్లగొండ సుబ్బారెడ్డి , పిడుగు సుబ్బారెడ్డి, సలా బాద్ బుజ్జి, ఎంపీటీసీ సుంకేసుల చాన్ భాష, రఘురాం రెడ్డి, తులసి దిలీప్ కుమార్, నాగార్జున, హరి, చౌదయ్య, కడప మోలాలి, ఒంటిమిట్ట మండలం ఎన్డీఏ కూటమి నాయకులు, తెదేపా శ్రేణులు పాల్గొన్నారు.

# కేరళ తరహాలో పంచాయతీల అభివృద్ధికి కృషి

పీలేరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త :



కేరళ రాష్ట్రం తరహాలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీల ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు పీలేరు గ్రామ పంచాయతీ ఈవో గురు మోహన్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ప్రవేశ పెడుతున్న అనేక పథకాలను ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి పంచాయతీ పరిధిలోనూ ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు గురు మోహన్ చెప్పారు. రాష్ట్ర ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కేరళ ప్రభుత్వంలోని ప్రతి పంచాయతీలోనూ స్థానికంగా అక్కడ జరుగుతున్న పనులను, మంజూరు చేయాల్సిన పనులను నోటీసు బోర్డులో ప్రతిరోజు ఉంచుతున్నారని అన్నారు. అదే విధంగా మన రాష్ట్రంలో కూడా నిర్వహించేందుకు తగిన సన్నాహాలు మొదలు పెట్టమని రాష్ట్ర అధికారులు ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలియజేశారు.

# మాజీ సైనికులకు న్యాయం చేయాలి

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలో మాజీ సైనికుని కుటుంబానానికి జరిగిన అన్యాయం పై అదేవిధంగా మదనపల్లి అసోసియేషన్ మాజీ సైనికుల పై నమోదు కాబడిన పిర్యాదు పై న్యాయం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు కోరారు. బుధవారం వారు ఈ విషయమై మదనపల్లి సబ్ కలెక్టర్ వేద స్వరూప్ కి వినతి పత్రాన్ని అందించారు. సబ్ కలెక్టర్ వేద స్వరూప్ సానుకూలంగా స్పందించి బాధిత మాజీ సైనికుని కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేస్తామని అదేవిధంగా ఈ విషయం పై పోరాడుతున్న మాజీ సైనికుల పై పెట్టిన కేసు విషయాన్ని కూడా పరిశీలించి పోలీసు వారికి దిద్దుబాటు చర్యలకు ఆదేశాలు ఇస్తానని స్పష్టంగా తెలియ జేయటంతో రాష్ట్ర కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సూరెడ్డి శివకుమార్, మదనపల్లి అసోసియేషన్ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, ప్రొద్దుటూరు అసోసియేషన్ అధ్యక్షులు బాలా వీరారెడ్డి, కదిరి అధ్యక్షులు గంగన్న తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న మాజీ సైనికులు

# సమస్యల రహిత సమాజం కోసం నిరంతర కృషి

## రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



చిన్నమండెం, ఏప్రిల్ 9 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లాను సమస్యల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేయడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చిన్నమండెం మండలం, బోరెడ్డి గారిపల్లెలోని తమ నివాసం నందు మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అరాచకాలు, అక్రమాలు, భూ దోపిడీలతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల కాలంలోనే ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి బాధితుల సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని వీటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చాలావరకు సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో ఏ ఒక్కరు భూ సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలను స్వీకరించి వారి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది. దీంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

# మాతా శిశు మరణాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి


గర్భవతులకు పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ ప్రియాంక

లక్కిరెడ్డిపల్లి : ఏప్రిల్ 09 ప్రభాత వార్త

మాతా శిశు మరణాలపై డాక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం దేవళంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు పరీక్షలు నిర్వహించారు. గర్భం దాల్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేరు నమోదు చేసుకొని నెల నెలా డాక్టర్లు అందిస్తున్న సలహాలు సూచనలు పాటించాలన్నారు. బిపి షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కాన్పులు కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో చేయించుకోవాలన్నారు. గర్భవతులు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు, పాలు, గుడ్లు ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవలంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని నజ్రియా, మహరాజ్ డాక్టర్ సుమలత, ఎంపీహెచ్ఈఓ దేవాదానం, సూపర్వైజర్లు సురేంద్ర రెడ్డి, మణి, ఏఎన్ఎంలు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో వీడ్కోలు కార్యక్రమం




రాయచోటి ఏప్రిల్ 9 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ లీ. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఇంజనీరింగ్ విద్యలో ప్రతి విభాగానికీ సమాన ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఎంచుకున్న విభాగంలో మొదటి సంవత్సరం నుంచే మంచి ప్రణాళికతో ముందుకెళ్లాలని, ప్రాక్టికల్స్ మరియు అకాడమిక్ అంశాల్లో దృఢమైన పట్టు సాధించి, పోటీ పరీక్షలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ, జూనియర్లకు మార్గదర్శకులుగా నిలవాలని, కళాశాల అభివృద్ధికి భాగస్వాములుగా మారాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి సహకరించాలి

పెనగలూరు ఏప్రిల్ 9 ప్రభాతవార్త

పేదవారి సొంత ఇంటి కల నిజం చేస్తాం. అర్హులైన పేదలకు సొంత ఇళ్లు మంజూరు అధికారులు పొసెషన్ ధ్రువీకరన పత్రాలను వెంటనే ఇవ్వాలని, ప్రజలకు ఈ విషయంలో ఇబ్బందులను కలిగించవద్దని, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. పెనగలూరు మండలంలో రానున్న వేసవి నేపథ్యంలో తాగు, సాగు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం పెనగలూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ,రెవిన్యూ, ఇరిగేషన్ ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఫారెస్ట్, పోలీస్ తదితర శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులతో రైతులు, సాగు, తాగు, రైతుల సమస్యలపై, రెవిన్యూ సమస్యపై ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెనగలూరు మండలం పరిధిలోని ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ మండల పరిషత్, జడ్పీటీసీ, పంచాయతీ నిధుల ద్వారా మండలంలోని అన్ని సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా రానున్న వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని, ఆర్వో ప్లాంట్లు లేని గ్రామాల్లో వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేయాలని ఈ విషయంలో సీఎం చంద్రబాబుతో మాట్లాడినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు దరఖాస్తు చేసుకున్న విధంగా ట్రాన్స్‌పార్మర్లకు కండకర్లు వైర్లు కూడా లిస్ట్‌లో ఉన్న ప్రకారం పారదర్శకంగా అందజేయాలని అధికారులకు సూచించారు. పార్టీలకు అతీతంగా పెనగలూరు మండలం అభివృద్ధికి సహకరించాలని సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర నాయకులకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భరణం విషయంలో భార్యలను రక్షించడానికే

# భర్తలను వేధించడానికి కాదు

## (సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు)

బద్వేలు లీగల్, ఏప్రిల్ 09 ప్రభాతవార్త :

చట్టాలలోని నిబంధనలు మహిళలను రక్షించడం కొరకేనని, భర్తలను బెదిరించడానికి, వేధించడానికి, ఆధిపత్యం చెలాయించడానికి, బలవంతంగా వసూలు చేయడానికి కాదని సుప్రీం కోర్టు పేర్కొనింది. వైవాహిక వ్యవస్థలో హింస, భరణం అంశాలపై దేశ వ్యాప్తంగా చర్చ నడుస్తున్న వేళ మరోమారు దేశ అత్యున్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వివాహ వ్యవస్థను హిందువులు పవిత్రమైనదిగా కుటుంబానికి బలమైన పునాదిగా భావిస్తారు, అదేమి వ్యాపారం లాంటిది కాదని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ పంకజ్ మిట్టల్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వాలు కఠినమైన చట్ట నిబంధనలను రూపొందించింది మహిళల సంక్షేమం కోసమేనని, భర్తలను వేధించి బెదిరించి శిక్షించి ఆస్తిని దండుకోవడానికి కాదని తెలిపింది. భార్యను క్రూరంగా హింసించారని, వేధింపులకు గురి చేశారని, అత్యాచారం చేశారనే ఆరోపణలన్నింటిని కలగలిపి నేర శిక్షా స్మృతిలోని సెక్షన్‌లను అనుసంధానించి ఆ ప్రకారం భర్త, అతని కుటుంబ సభ్యులపై కేసులు పెడుతున్నారు, భార్య తరుపున గట్టిగా బేరసారాలు చేసేందుకు భర్త, అతని కుటుంబ సభ్యులపై తీవ్రమైన నేరారోపణలు చేయడం కూడా పరిపాటిగా మారిందని ధర్మాసనం ఓ కేసు విషయంలో ఆక్షేపించింది. ఈ డిమాండ్లలో అత్యధికంగా ఆర్థిక పరమైనవే ఉంటున్నాయని ధర్మాసనం ప్రస్తావిస్తూ గృహ హింస పిర్యాదులతో రంగంలోకి దిగే పోలీసులు కూడా భర్త తరుపు బంధువులలో వృద్ధులను, అనారోగ్యంతో వున్న వారిని కూడా అరెస్టు చేసి బెయిల్ రాకుండా చేస్తున్నారని, ఈ ఘటనలన్నీ ఓ గొలుసు కట్టు చర్యగా వుంటాయని పేర్కొనింది. విడాకులు తీసుకున్న తరువాత మాజీ భర్తకు వ్యాపారంలో నష్టాలు వచ్చి దివాలా తీస్తే మాజీ భార్య వచ్చి ఆ కష్టాల్లో ఏమైనా భాగం పంచుకుంటుందా? అని ధర్మాసనం ప్రశ్నిస్తూ తీవ్ర మనఃస్పర్థలతో విడివిడిగా నివసిస్తున్న దంపతుల వైవాహిక బంధాన్ని రద్దు చేస్తూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలను చేసింది. ఈ కేసులో భార్యకు శాశ్వత భరణం నెల లోగా చెల్లించాలన్న క్రింది కోర్టు ఉత్తర్వులను సుప్రీం కోర్టు సమర్థిస్తూ ఈ క్రమంలో ఆ భర్తపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయడం గమనార్హం. తన భర్తకు వేల కోట్లు ఆస్తులున్నాయని, అతని తొలి భార్యకు కొన్ని కోట్ల రూపాయలను భరణంగా ఇచ్చారు కనుక తనకూ అదే స్థాయిలో భరణం చెల్లించాలన్న పిటీషనరు వాదనలను ధర్మాసనం త్రోసిపుచ్చి ఫ్యామిలీ కోర్టు నిర్ణయించిన భరణాన్ని ఖరారు చేస్తూ భార్యను రక్షించడానికే తప్ప భర్తలను వేధించడానికి కాదు అంటూ భరణం విషయంపై సుప్రీం కోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# శ్రీ చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలలో పాల్గొన్న మంత్రి

## ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి



చిన్నమండెం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :

చిన్నమండెం మండలం, దేవగుడిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన శ్రీ చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాలలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని శ్రీ చౌడేశ్వరి జ్యోతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చౌడేశ్వరి జ్యోతి ఆలయ కమిటీ సభ్యులు మంత్రివర్యులకు పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చక స్వాములు మంత్రికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని శ్రీ చౌడేశ్వరి జ్యోతి అమ్మవారిని మొక్కుకోవడం జరిగిందన్నారు.

# రాములు గుడిలో మంత్రి ప్రత్యేక ప్రార్థనలు



రాయచోటి, ఏప్రిల్ 9 ప్రభాతవార్త

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం రాయచోటి మండలంలోని సిబ్యాల గ్రామం, పాతఅనుమ్ పల్లి లోని శ్రీరాములగుడిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులకు అర్చక స్వాములు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలోటిడిపి నాయకులు అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా మొదలైన జాతీయస్థాయి టెక్ పెస్ట్ 25



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

అన్నమాచార్య యూనివర్సిటీలో టెక్ పెస్ట్ 25 బుధవారం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు ఈ టెక్ పెస్ట్25 జరగనుంది. రాజంపేటలోని అన్నమాచార్య యూనివర్సిటీ జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న రెండు రోజుల సాంకేతిక మరియు సాంస్కృతిక మహోత్సవం టెక్ పెస్ట్ –2025 ప్రారంభ కార్యక్రమానికి ఆర్.కే. వ్యాలీ క్యాంపస్, ఆర్జీయూకేటీ–ఏపీ డైరెక్టర్ డా. A.V.S.S. కుమార స్వామి గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ,"సాంకేతిక రంగంలో జరిగే మార్పులను గుర్తించి, విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కొత్త విషయాలను నేర్చుకుని వాటిని అన్వయించుకోవడమే విజయం సాధించే మార్గం" అని వివరించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ డా. ఈ. సాయిబాబా రెడ్డి గారు మాట్లాడుతూ ఈ టెక్ పెస్ట్ –2025 వంటి వేదికలు విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే గొప్ప అవకాశాలుగా నిలుస్తాయన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా తమ సృజనాత్మకతను, సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలి అని సూచించారు. ప్రిన్సిపాల్ డా. ఎస్.ఎం.వి. నారాయణ మాట్లాడుతూ, ఇలాంటి వేదికలు విద్యార్థుల జీవితాల్లో ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు జీవితంలో ముందుకు సాగాలి" అని పేర్కొన్నారు. డా. ఎన్. మల్లికార్జునరావు (రిజిస్ట్రార్), డా. ఎం. సుబ్బారావు గారు (డీన్ విద్యార్థుల వ్యవహారాలు), విభాగాధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి రోజున వివిధ విభాగాల ఆధ్వర్యంలో పేపర్ ప్రెజెంటేషన్లు, ప్రాజెక్ట్ ప్రదర్శనలు, కోడింగ్ పోటీలు, పోస్టర్ ప్రదర్శనలు, షార్ట్ ఫిల్మ్ మేకింగ్ వంటి సాంకేతిక కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు కూడా ఈవెంట్‌లో పాల్గొని తమ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించారు. రెండవ రోజు కార్యక్రమాల్లో మరిన్ని టెక్నికల్ సెషన్లు, వర్క్‌షాపులు, అవార్డు ప్రదానోత్స వాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టెక్ పెస్ట్ –2025 విద్యా ర్థుల ప్రతిభను వెలికి తీసే ప్రేరణాత్మక వేదికగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు.